శుక్రవారం హైదరాబాద్‌లో 16వ పౌల్ట్రీ ఎక్స్‌పో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పౌల్ట్రీ ఇండియా అధ్యక్షుడు ఉదయ్‌సింగ్ బయాస్ తదితరులు

పౌల్ట్రీ ఉత్పత్తులపై జీఎస్టీ ఎత్తేయండి

- పౌల్ట్రీ ఇండియా అధ్యక్షుడు ఉదయ్‌సింగ్ బయాస్
- 27 నుంచి హైదరాబాద్‌లో పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పో

హైదరాబాద్, నవంబర్ 8 (నమస్తేతెలంగాణ): పౌల్ట్రీ ఉత్పత్తులపై జీఎస్టీ పేరుతో ప్రభుత్వాలు ఇబ్బడిముబ్బడిగా పన్నులు వసూలు చేస్తున్నాయని, దీంతో ఈ పరిశ్రమ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నదని ఇండియన్ పౌల్ట్రీ ఎక్విప్‌మెంట్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్(ఐపీఈఎంఏ), పౌల్ట్రీ ఇండియా అధ్యక్షుడు ఉదయ్‌సింగ్ బయాస్ ఆందోళన వ్యక్తంచేశారు. ఈ నెల 27 నుంచి 29 వరకు నిర్వహించనున్న 16వ పౌల్ట్రీ ఎక్స్‌పో పోస్టర్‌ను ఆయన శుక్రవారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ముడి సరుకు వ్యయాలు పెరగడం, దాణా ఉత్పత్తులు, సోయా మీల్, పౌల్ట్రీ పరికరాలపై జీఎస్టీ విధిస్తుండటంతో ఈ పరిశ్రమ ఆర్థికంగా ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంటున్నదని, వెంటనే ప్రభుత్వాలు జీఎస్టీ మినహాయింపునివ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పౌల్ట్రీ రంగంలో సాంకేతికత ఆవిష్కరణలను ప్రదర్శించడానికి జాతీయ, అంతర్జాతీయ సంస్థలను ఒక్కతాటిపైకి తేవాలనే ఉద్దేశంతో ఈ నెల చివర్లో పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పోను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ఎక్స్‌పోకి 50కి పైగా దేశాల నుంచి సుమారు 400 మంది పాల్గొనే అవకాశాలున్నాయన్నారు. దేశ ఆహార భద్రత, గ్రామీణ ఉపాధి, పోషకాహార సంక్షేమానికి మూలస్తంభమైన పౌల్ట్రీ రంగానికి ప్రభుత్వం అండగా నిలవాలని లక్షలాది పౌల్ట్రీ రైతుల తరపున ప్రభుత్వానికి ఐపీఈఎంఏ విజ్ఞప్తి చేశారు. ఆర్థిక ఒత్తిడిని తగ్గించడానికి సోయా మీల్, ప్రాసెసింగ్ యంత్రాలపై జీఎస్టీని మినహాయింపు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. జంతువుల వ్యాధుల నుంచి కాపాడేందుకు వ్యాక్సిన్ దిగుమతులకు సత్వర అనుమతులు కల్పించాలన్నారు. పిల్లల్లో పోషకాహార లోపం సమస్యను నివారించేందుకు దేశవ్యాప్తంగా పాఠశాలల భోజన కార్యక్రమాలలో గుడ్డును చేర్చడానికి మద్దతివ్వాలని కోరారు. పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పో 2024 సమాచారం కోసం www.poultryindia.co.inని సందర్శించాలని ఉదయ్‌సింగ్ బయాస్ కోరారు.

రూపాయికి మరిన్ని బిల్లులు

చారిత్రక కనిష్ఠ స్థాయికి పడిపోయిన విలువ

డాలర్‌తో పోలిస్తే 5 పైసలు తగ్గి 84.37కి



ముంబై, నవంబర్ 8: దేశీయ కరెన్సీ విలువ చారిత్రక కనిష్ఠ స్థాయికి దిగజారింది. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా పెట్టుబడులను ఉపసంహరించుకోవడం, ఈక్విటీ మార్కెట్లు నిలకడగా ట్రేడవడంతో మారకంపై ప్రతికూల ప్రభావం పడింది. ఫలితంగా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ వరుసగా మూడోరోజు శుక్రవారం కూడా 5 పైసలు నష్టపోయి రికార్డు స్థాయికి పడిపోయింది. ఫారెక్స్ మార్కెట్ ముగిసే సమయానికి డాలర్-రుపీ ఎక్స్చేంజ్ రేటు 84.37కి జారుకున్నది. 84.32 వద్ద ప్రారంభమైన డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ ఒక దశలో 84.31 గరిష్ఠ స్థాయిని తాకింది. ఇంట్రాడేలో 84.38 కనిష్ఠ స్థాయిని తాకిన విలువ చివరకు ఐదు పైసల నష్టంతో 84.37 వద్ద ముగిసింది. గురువారం మారకం విలువ ఒక్క పైసా నష్టపోయిన విషయం తెలిసిందే. దీంతో వరుసగా మూడు సెషన్లలో రూపాయి విలువ 28 పైసలు నష్టపోయింది. దేశీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా నిధులను తరలించుకుపోవడం, అంతర్జాతీయ మార్కెట్లో ఇంధన ధరలు భారీగా పతనమవడం కూడా రూపాయి పతనానికి ఆజ్యం పోశాయని బీఎన్‌పీ పరిబాస్ రీసర్చ్ హెడ్ అనూజ్ చౌదరీ తెలిపారు.

దెబ్బతీసిన ఫెడ్ నిర్ణయం

అమెరికా ఫెడరల్ రిజర్వు మరోసారి వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలుండటంతో ఇతర కరెన్సీలు తీవ్ర ఆటుపోటులకు గురయ్యాయని ఫారెక్స్ ట్రేడర్ వెల్లడించారు. అమెరికా అధ్యక్షుడిగా గెలుపొందిన డొనాల్డ్ ట్రంప్..పన్ను, వాణిజ్య విధానాలు గ్లోబల్ ఆర్థిక మార్కెట్లను ప్రభావితం చేస్తాయోమోనన్న ఆందోళనలు నెలకొన్నాయని, అందుకే రూపాయి ఒడిదుడుకులు లోనవుతుందన్నారు. గతవారంలో పావు శాతం వడ్డీరేట్లను తగ్గించిన ఫెడ్..వచ్చే సమీక్షలోనూ ఇంతే స్థాయిలో తగ్గించే అవకాశం ఉన్నట్లు వచ్చిన సంకేతాలు ఫారెక్స్ మార్కెట్లో ప్రకంపనాలు సృష్టించింది. బ్యారెల్ క్రూడ్ ధర 1.10 శాతం తగ్గి 74.80 డాలర్లకు చేరుకుంది. దేశీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి ఎఫ్ఐఐలు శుక్రవారం రూ.3,404 కోట్ల పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు.

మరింత కరిగిన విదేశీ నిల్వలు

విదేశీ మారకం నిల్వలు కరిగిపోయాయి. విదేశీ మారకం రూపంలో ఉన్న ఆస్తుల విలువ అంతకంతకు తగ్గిపోవడంతో నవంబర్ 1తో ముగిసిన వారాంతానికిగాను ఫారెక్స్ రిజర్వులు 2.67 బిలియన్ డాలర్లు తరిగిపోయి 682.13 బిలియన్ డాలర్లకు తగ్గాయని ఆర్బీఐ తన వారాంతపు సమీక్షలో వెల్లడించింది. అంతక్రితం వారంలోనూ రిజర్వులు 3.463 బిలియన్ డాలర్లు తగ్గి 684.805 బిలియన్ డాలర్లకు పడిపోయిన విషయం తెలిసిందే. సెప్టెంబర్ చివరినాటికి రికార్డు స్థాయి 704.885 బిలియన్ డాలర్లకు చేరుకున్న ఫారెక్స్ రిజర్వులు ఆ మరుసటి నుంచి దిగువముఖం పట్టాయి. గత వారంతానికిగాను విదేశీ కరెన్సీ రూపంలో ఉన్న ఆస్తుల విలువ 3.902 బిలియన్ డాలర్లు తగ్గి 589.849 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. డాలర్‌తోపాటు ఇతర కరెన్సీలు యూరో, పౌండ్, యెన్ కరెన్సీలు పతనం చెందడం ఇందుకు కారణమని తెలిపింది. కానీ, పసిడి రిజర్వులు 1.224 బిలియన్ డాలర్లు పెరిగి 69.751 బిలియన్ డాలర్లకు చేరుకున్నట్లు వెల్లడించింది.

ఎస్బీఐ లాభం 19,782 కోట్లు

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు నుంచి 'బెస్ట్ సర్వీసెస్' అవార్డు అందుకుంటున్న టీసీఎస్ టెక్నాలజీ ప్రెసిడెంట్ వీ రాజన్న

- క్యూ2లో 23 శాతం పెరిగిన ప్రాఫిట్
- రూ.1.29 లక్షల కోట్లకు ఆదాయం

ముంబై, నవంబర్ 8: దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) ఆర్థిక ఫలితాల్లో అంచనాలకుమించి రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికిగాను బ్యాంక్ రూ.19,782 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.16,099 కోట్ల లాభంతో పోలిస్తే 23 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నది. ఏకీకృత విషయానికి వస్తే బ్యాంక్ రూ.18,331 కోట్ల లాభాన్ని గడించింది. అటు ఆదాయంలోనూ రికార్డు నెలకొల్పింది. గత త్రైమాసికంలో బ్యాంక్ రూ.1.29 లక్షల కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. బ్యాంక్ చైర్మన్‌గా సీఎస్ శెట్టి పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇంతటి స్థాయిలో ఆదాయం ఆర్జించడం ఇదే తొలిసారి. ఏడాది క్రితం ఇది రూ.1.12 లక్షల కోట్లుగా ఉన్నది. సమీక్షకాలంలో బ్యాంక్ నిర్వహణ ఖర్చులు రూ.92,752 కోట్ల నుంచి రూ.99,847 కోట్లకు పెరిగినట్లు వెల్లడించారు.

ప్రొవిజనింగ్ రెండింతలు

మొండి బకాయిలను పూడ్చుకోవడానికి బ్యాంక్ అధిక స్థాయిలో నిధులను కేటాయించింది. గత త్రైమాసికానికిగాను బ్యాంక్ రూ.3,631 కోట్ల నిధులను కేటాయించింది. అంతక్రితం ఏడాది రూ.1,814 కోట్లతో పోలిస్తే రెండు రెట్లు పెరిగినట్లు బ్యాంక్ వర్గాలు వెల్లడించాయి. అలాగే బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 2.21 శాతం నుంచి 2.13 శాతానికి తగ్గగా, నికర ఎన్‌పీఏ మాత్రం స్వల్పంగా పెరిగి 0.53 శాతానికి చేరుకున్నది.

- బ్యాంక్ ఆపరేటింగ్ ప్రాఫిట్ ఏడాది ప్రాతిపదికన 51 శాతం ఎగబాకి రూ.29,294 కోట్లకు చేరుకున్నది.
- నికర వడ్డీ ఆదాయం 5.37 శాతానికి ఎగబాకి రూ.41,620 కోట్లకు చేరింది. వడ్డీయేతర ఆదాయం కూడా 42 శాతం అధికమై రూ.15,271 కోట్లుగా నమోదైంది.
- బ్యాంక్ డిపాజిట్లు 9.13 శాతం పెరిగి రూ.51,17,284 కోట్లకు చేరుకున్నాయి. గతేడాది ఇది రూ.46,89,218 కోట్లుగా ఉన్నాయి.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అడ్వాన్స్‌ల్లో 14-16 శాతం మధ్యలో వృద్ధి నమోదుకానుండగా, డిపాజిట్లలో మాత్రం 10 శాతం మించే అవకాశాలు లేవు. డిపాజిట్లను ఆకట్టుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలతో ఈ ఏడాది రెండంకెల వృద్ధి ఆశిస్తున్నాం. ఒక ఆర్థిక సంవత్సరంలో లక్ష కోట్ల రూపాయల లాభాన్ని ఆర్జించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. తొలి ఆరు నెలల్లో ఆపరేటింగ్ ప్రాఫిట్ రూ.64 వేల కోట్లుగా నమోదైంది. వచ్చే ఫిబ్రవరి లోపు రిజర్వు బ్యాంక్ వడ్డీరేట్లు తగ్గించే అవకాశాలు లేవు. -సీఎస్ శెట్టి, ఎస్బీఐ చైర్మన్

- గత త్రైమాసికంలో కొత్తగా రూ.3,831 కోట్ల రుణాలు మొండి బకాయిల జాబితాలోకి చేరాయి.

స్విగ్గీ ఐపీవో భేష్

న్యూఢిల్లీ, నవంబర్ 8: ఫుడ్ డెలివరీ సేవల సంస్థ స్విగ్గీ ఐపీవోకి రిటైల్ పెట్టుబడిదారుల నుంచి విశేష స్పందన లభించింది. తొలి రెండు రోజుల్లో మిశ్రమంగా ఉన్న ఈ వాటా విక్రయానికి చివరి రోజు ఎగబడి కొనుగోళ్లు జరిపారు. దీంతో కంపెనీ జారీ చేసిన షేర్లకు నాలుగు రెట్ల అధిక బిడ్డింగ్‌లు వచ్చాయని పేర్కొంది. రూ.11 వేల కోట్ల వాటా విక్రయానికి సంబంధించి సంస్థ జారీ చేసిన 16,01,09,703 షేర్లకుగాను 57,53,07,536 షేర్ల బిడ్డింగ్‌లు వచ్చాయి. షేరు ధరల శ్రేణిని రూ.371-390 స్థాయిలో నిర్ణయించింది.

ఎల్ఐసీ ప్రాఫిట్ డౌన్

న్యూఢిల్లీ, నవంబర్ 8: దేశీయ బీమా దిగ్గజం ఎల్ఐసీ నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. సెప్టెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.7,621 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. 2023-24 ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.7,925 కోట్ల లాభంతో పోలిస్తే 3.8 శాతం తగ్గింది. ఇతర మార్గాల ద్వారా వచ్చే ఆదాయం తగ్గుముఖం పట్టడం వల్లనే లాభాల్లో గండిపడిందని పేర్కొంది. గత త్రైమాసికంలో నికర ప్రీమియం ఆదాయం రూ.1,19,901 కోట్లు సమకూరింది. అంతక్రితం ఏడాది ఇది రూ.1,07,397 కోట్లుగా ఉన్నది. ఇతర మార్గాల ద్వారా వచ్చే ఆదాయం రూ.248 కోట్ల నుంచి రూ.145 కోట్లకు తగ్గడం వల్లనే ఫలితాలపై ప్రతికూల ప్రభావం చూపాయని ఎల్ఐసీ ఎండీ, సీఈవో సిద్ధార్థ మొహంతీ తెలిపారు. అయినప్పటికీ కంపెనీ మొత్తం ఆదాయం రూ.2,01,587 కోట్ల నుంచి రూ.2,29,620 కోట్లకు పెరిగినట్లు బీఎస్ఈకి సమాచారం అందించింది. మరోవైపు నిర్వహణ ఖర్చులు కూడా రూ.1,94,335 కోట్ల నుంచి రూ.2,22,366 కోట్లకు పెరిగాయి. క్రితం ఏడాది 2.43 శాతంగా ఉన్న కంపెనీ స్థూల నిరర్థక ఆస్తుల విలువ గత త్రైమాసికానికిగాను 1.72 శాతానికి తగ్గాయని పేర్కొంది. అలాగే ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మధ్యకాలంలో కంపెనీ రూ.2,33,671 కోట్ల ప్రీమియం వసూళ్లపై రూ.18,082 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది.

20న మార్కెట్లకు సెలవు

న్యూఢిల్లీ, నవంబర్ 8: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరుగుతుండటంతో ఈ నెల 20న స్టాక్ మార్కెట్లు సెలవు పాటించనున్నాయి. బీఎస్ఈతోపాటు ఎన్ఎస్ఈ, ఫ్యూచర్ అండ్ ఆప్షన్స్, సెక్యూరిటీస్ లెండింగ్ అండ్ బారోయింగ్ విభాగం కూడా మూసివేసివుంచనున్నారు. ప్రస్తుత నెలలో స్టాక్ మార్కెట్లు సెలవు పాటించడం ఇది మూడోసారి. నవంబర్ 1న దీపావళి సందర్భంగా మూసివేసివుంచగా, గురునానక్ జయంతి సందర్భంగా ఈ నెల 15న సెలవు పాటించనున్నాయి.

టాటా మోటర్స్‌కు అమ్మకాల సెగ

క్యూ2లో 10 శాతం తగ్గిన నికర లాభం

న్యూఢిల్లీ, నవంబర్ 8: దేశీయ ఆటోమొబైల్ దిగ్గజాల్లో ఒకటైన టాటా మోటర్స్ లాభాలకు బ్రేక్‌పడింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికిగాను సంస్థ రూ.3,450 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో వచ్చిన రూ.3,832 కోట్ల లాభంతో పోలిస్తే 9.9 శాతం పడిపోయింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.1,04,444 కోట్ల నుంచి రూ.1,00,534 కోట్లకు పడిపోయినట్లు వెల్లడించింది. అమ్మకాలు తగ్గుముఖం పట్టడం వల్లనే లాభాల్లో క్షీణత కనబరిచినట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. నిర్వహణ ఖర్చులు రూ.1,00,649 కోట్ల నుంచి రూ.97,330 కోట్లకు తగ్గాయి. జేఎల్ఆర్ ఆదాయం 5.6 శాతం తగ్గి 6.5 బిలియన్ పౌండ్లకు పడిపోయింది. గత త్రైమాసికంలో సంస్థ ప్యాసింజర్ వాహన విక్రయాలు 6.1 శాతం తగ్గి 1,30,500కు పడిపోయాయి. కమర్షియల్ వాహన అమ్మకాలు కూడా ఏడాది ప్రాతిపదికన 19.6 శాతం తగ్గి 79,800కి తగ్గాయి.

విప్రోలో ప్రేమ్‌జీ ఇన్వెస్ట్ వాటా

న్యూఢిల్లీ, నవంబర్ 8: ఐటీ సేవల సంస్థ విప్రోలో 1.6 శాతం వాటాను కొనుగోలు చేసింది ప్రైవేట్ ఈక్విటీ సంస్థ ప్రేమ్‌జీ. పూర్తిగా బ్లాక్‌డీల్‌లో జరిగిన ఈ ఒప్పందం విలువ రూ.4,757 కోట్లు. షేరుకు రూ.560 చొప్పున 8,49,54,128 షేర్లను బహిరంగ మార్కెట్లో కొనుగోలు చేసింది. దీంతో విప్రోలో అజీం ప్రేమ్‌జీకి చెందిన ప్రేమ్‌జీ ట్రేడర్ 4.49 కోట్ల షేర్లను కొనుగోలు చేసినట్లు అయింది.

శస్త్ర చికిత్స కోసం యూఎస్‌కు

కన్నడ స్టార్ హీరో శివరాజ్‌కుమార్ అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా ఓ ఛానల్‌కిచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. ప్రస్తుతం ఆయన తన తాజా చిత్రం 'భైరతి రంగల్' ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నారు. ఈ నెల 15న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో శివరాజ్‌కుమార్ మాట్లాడారు. 'మనిషి అన్న తర్వాత శారీరక సమస్యలు సహజం. నేను ఆనారోగ్యంతో బాధపడుతున్న మాట నిజం. నా ఆరోగ్య సమస్య గురించి తొలిసారి తెలిసినప్పుడు భయపడిపోయా. నేను భయపడి, అభిమానుల్ని కలవరపెట్టడం నాకిష్టంలేదు. అందుకే గుండెనిండా ఆత్మవిశ్వాసాన్ని నింపుకున్నా. ప్రస్తుతం చికిత్స తీసుకుంటున్నా. ఇప్పటికే నాలుగు సెషన్ల ట్రీట్‌మెంట్ పూర్తయింది. అభిమానులు ఆందోళన చెందవద్దు. నేను బాగున్నాను. ఇప్పుడంతా బాగానే ఉంది. నేను అబద్ధం చెప్పను.' అన్నారు శివరాజ్‌కుమార్. ఇంకా ఆయన మాట్లాడుతూ 'నా సమస్య నా నిర్మాతలకూ తెలుసు. అందుకే.. వారూ సహకరిస్తున్నారు. నేను కూడా ఒప్పుకున్న సినిమాల షూటింగ్స్ పూర్తి చేస్తున్నాను. విడుదలకు సిద్ధమైన సినిమాల ప్రచార కార్యక్రమాల్లో నిర్విరామంగా పాల్గొంటున్నా. అన్ని కార్యక్రమాలనూ పూర్తి చేసి, త్వరలోనే శస్త్రచికిత్స నిమిత్తం అమెరికా వెళ్తున్నా. ఆ తర్వాత నెలరోజులు పూర్తి విశ్రాంతి. రాబోయే రెండుమూడు నెలల్లో అన్నీ సర్దుకుంటాయని ఆశిస్తున్నా' అని తెలిపారు శివరాజ్‌కుమార్.

రెండు షిఫ్ట్‌ల్లో బిజీ

చిత్రం

ఒకప్పుడు అగ్ర కథానాయికలు రెండు, మూడు షిఫ్ట్‌ల్లో పనిచేసేవారు. తమ వల్ల సినిమా షెడ్యూల్స్‌కు ఎలాంటి ఇబ్బంది రాకుండా చూసుకునేవారు. ఇప్పుడు అలాంటి అంకితభావం ఉన్న నాయికలు చాలా అరుదనే చెప్పాలి. ప్రస్తుత కన్నడ భామ రష్మిక మందన్న సైతం అదే తరహాలో రెండు షిఫ్ట్‌ల్లో పనిచేస్తూ బిజీగా ఉంది. ఆమె కథానాయికగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'పుష్ప-2' డిసెంబర్ 5న విడుదలకు సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. షూటింగ్ చివరి దశకు చేరుకోవడంతో రష్మిక మందన్న ఈ సినిమా విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నది. అదే సమయంలో ఆమె సల్మాన్‌ఖాన్ సరసన నటిస్తున్న 'సికందర్' సినిమా షూటింగ్ సైతం ప్రస్తుతం హైదరాబాద్‌లోనే జరుగుతున్నది. ఈ సినిమాల కోసం రెండు షిఫ్ట్‌ల్లో పనిచేస్తున్నదట రష్మిక మందన్న. 'పుష్ప' చిత్రంలో ఆమె పోషించిన శ్రీవల్లి పాత్రకు యువతరంలో మంచి క్రేజ్ దక్కింది. ఈ నేపథ్యంలో సీక్వెల్‌లో ది బెస్ట్ పర్‌ఫార్మెన్స్ ఇవ్వాలనే తపనతో పనిచేస్తున్నదట రష్మిక. వర్క్ విషయంలో ఆమె అంకితభావాన్ని చూసిన యూనిట్ సభ్యులు ఫిదా అవుతున్నారట. ప్రస్తుతం రష్మిక మందన్న తెలుగులో కుబేర, రెయిన్‌బో, ది గర్ల్‌ఫ్రెండ్ చిత్రాలతో బిజీగా ఉంది.

ప్రభాస్‌కు మాత్రమే సాధ్యం

దేశంలోనే అత్యంత డిమాండ్ ఉన్న సూపర్‌స్టార్లలో ఒకరిగా అవతరించారు ప్రభాస్. 'బాహుబలి' ఫ్రాంచైజీ నుంచి నిన్నమొన్నటి 'కల్కి 2898ఏడీ' వరకూ ఆయన నటించిన ప్రతి సినిమా, వందలకోట్ల వసూళ్లను రాబడుతూ ప్రభాస్ స్టామినాను తెలియజేస్తూనే ఉంది. దేశవ్యాప్తంగా విమర్శలను ఎదుర్కొన్న 'ఆదిపురుష్' సైతం దాదాపు 450కోట్ల వసూళ్లను రాబట్టిందంటే ప్రభాస్ స్టామినా ఏంటో అర్థం చేసుకోవచ్చు. ఆయన 'బాహుబలి 2' 1800కోట్ల వసూళ్లతో దేశంలోనే అత్యధిక వసూళ్లు సాధించిన సినిమాల్లో ఒకటిగా నిలిచింది. ఇప్పటికీ ఆ రికార్డును అందుకునే సినిమా రాలేదు. ప్రస్తుతం ఆయన జెట్ వేగంతో సినిమాలు చేస్తూ దూసుకుపోతున్నారు. మారుతి దర్శకత్వంలో 'రాజా సాబ్', హను రాఘవపూడి దర్శకత్వంలో 'ఫౌజీ', మరోవైపు సందీప్‌రెడ్డి వంగా 'స్పిరిట్', ఇంకోవైపు ప్రశాంత్‌నీల్ 'సలార్ 2'. ఇక నాగ్ అశ్విన్ 'కల్కి 2' ఇలాగూ ఉంది. వీటిలో కొన్ని షూటింగ్ దశలో ఉంటే.. కొన్ని ప్రీప్రొడక్షన్ దశలో ఉన్నాయి. ఇదిలావుంటే.. ఈ వేగాన్ని మరింత ఉధృతం చేసే దిశగా ప్రభాస్ అడుగులేస్తున్నారు. కన్నడ సినీరంగంలో పేరెన్నికగన్న ప్రతిష్ఠాత్మక చిత్ర నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్. ఇప్పటికే వారు నిర్మిస్తున్న 'సలార్ 2'లో నటిస్తున్నారు ప్రభాస్. ఈ సినిమా తర్వాత 'హోంబలే' నుంచి వచ్చే మరో రెండు సినిమాల్లో ఆయన నటించేందుకు ఒప్పందం కుదిరింది. ఆ సినిమాలేంటి? దర్శకులెవరు? తదితర అంశాలపై త్వరలోనే క్లారిటీ రానుంది. అయిదు సినిమాలు ప్రస్తుతం నిర్మాణంలో ఉండగా, మరో రెండు సినిమాలకు ప్రభాస్ సైన్ చేయడం ఇప్పుడు చర్చనీయాంశమైంది.

22న రానున్న కేసీఆర్

జబర్దస్త్ కమెడియన్ రాకింగ్ రాకేష్ స్వీయ నిర్మాణంలో హీరోగా నటిస్తున్న చిత్రం 'కేశవ చంద్ర రమావత్' (కేసీఆర్). గరుడవేగ అంజి దర్శకత్వం వహిస్తున్నారు. అనన్య కృష్ణన్ కథానాయిక. ఈ నెల 22న ప్రేక్షకుల ముందుకురానుంది. శుక్రవారం రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ను నటుడు, దర్శకుడు 'బలగం' వేణు విడుదల చేశారు. 'ఓ లంబాడీ యువకుడి నిజ జీవితం నుంచి స్ఫూర్తిపొంది ఈ సినిమాను తెరకెక్కించాం. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌గారి అభిమాని కథగా అందరినీ ఆకట్టుకుంటుంది. తెలుగు రాష్ట్రాలతోపాటు ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమాను విడుదల చేయబోతున్నాం' అని చిత్రబృందం పేర్కొంది. తనికెళ్ల భరణి, ధనరాజ్, తాగుబోతు రమేష్, జోర్దార్ సుజాత, లోహిత్ కుమార్, రచ్చ రవి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంభాషణలు: రాజ్‌కుమార్ కుసుమ, సంగీతం: చరణ్‌అర్జున్, స్క్రీన్‌ప్లే, రచన, నిర్మాత: రాకింగ్ రాకేష్, సినిమాటోగ్రఫీ, దర్శకత్వం: 'గరుడవేగ' అంజి.

మన విజయాలే మాట్లాడాలి

'ఇటీవల ఓ హీరో తమ సినిమాను సెలబ్రిటీలే వరూ సపోర్ట్ చేయడంలేదని వాపోయాడు. ఇక్కడ ఎవరి బిజీ వాళ్లది. ఎవరొచ్చారు.. ఎవరు రాలేదు.. అనేది ముఖ్యం కాదు. ఇక్కడ టాలెంట్ ముఖ్యం. అది ఉంటే ఎవరైనా సక్సెస్ అవుతారు. కష్టపడ్డారు కాబట్టే 'క' అంతటి సక్సెస్ అయ్యింది. కిరణ్.. నువ్వు కూడా ఎప్పుడూ ఎమోషనల్ కావొద్దు. నువ్వు మాట్లాడకూడదు. నీ సక్సెస్ మాట్లాడాలి. పరిశ్రమలో ఎవరూ సపోర్ట్ చేయరు. అలాగే వెనక్కి లాగరు. ఇక్కడ హార్డ్‌వర్కే మనల్ని నిలబెట్టేది.' అని అగ్ర నిర్మాత దిల్ రాజు అన్నారు. గురువారం హైదరాబాద్‌లో జరిగిన 'క' మూవీ సక్సెస్‌మీట్‌లో అతిథిగా విచ్చేసిన ఆయన పై విధంగా స్పందించారు. కిరణ్ అబ్బవరం కథానాయకుడిగా రూపొందిన 'క' చిత్రానికి సుజీత్, సందీప్ దర్శకులు. చింతా గోపాలకృష్ణారెడ్డి నిర్మాత. సక్సెస్‌మీట్‌లో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ ' 'క' విడుదలకు ముందు నెగెటివ్‌గా మాట్లాడిన వాళ్లు 99శాతం ఉండేవారు. మంచి మూవీ అని చెప్పినా నమ్మలేదు. కానీ జనం మాత్రం సినిమాను బాగా నమ్మారు. అందుకే ఈ స్థాయి సక్సెస్ దక్కింది. ఇంతటి విజయాన్నిచ్చిన ప్రేక్షకులకు మా టీమ్ అంతా రుణపడి ఉంటుంది.' అన్నారు. ఇంకా అతిథులుగా విచ్చేసిన బన్నీవాసు, దర్శకులు వశిష్ఠ, అనిల్ విశ్వనాథ్‌లతోపాటు చిత్ర దర్శకులు సుజీత్, సందీప్, నిర్మాత చింతా గోపాలకృష్ణారెడ్డి, పంపిణీదారుడు నందిపాటి వంశీ, నటి శరణ్య కూడా మాట్లాడారు.

లగ్గానికి టైమైంది

నూతన నిర్మాణ సంస్థ 20th సెంచరీ రూపొందిస్తున్న తొలి చిత్రం 'లగ్గం టైమ్'. రాజేష్ మేరు, నవ్య చిత్యాల జంటగా నటిస్తున్నారు. ప్రజోత్ కె వెన్నం దర్శకుడు. కె.హిమబిందు నిర్మాత. ఇటీవల ఈ చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను యువ దర్శకుడు సాగర్ కె చంద్ర ఆవిష్కరించారు. 'పెళ్లి నేపథ్యంలో సాగే కథాంశమిది. చక్కటి హాస్యంతో పాటు హృదయాన్ని కదిలించే సెంటిమెంట్‌తో ఆకట్టుకుంటుంది. కుటుంబం అంతా కలిసి హాయిగా ఆస్వాదించేలా ఉంటుంది. ఫీల్‌గుడ్ ఎంటర్‌టైనర్‌గా అన్ని వర్గాలను మెప్పిస్తుంది. ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలో వెల్లడిస్తాం' అని చిత్ర బృందం పేర్కొంది. నెల్లూరు సుదర్శన్, ప్రీతిసుందర్, ప్రణీత్ రెడ్డి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ, సంగీతం: పవన్ గుంటుకు, రచన-దర్శకత్వం: ప్రజోత్ కె వెన్నం.

శ్రీకాంత్ కొత్త అవతారం

సాయిదుర్గతేజ్ కథానాయకుడిగా రోహిత్ కేపీ దర్శకత్వంలో ఓ పీరియాడ్ యాక్షన్ డ్రామా రూపొందుతున్న విషయం తెలిసిందే. కె.నిరంజన్‌రెడ్డి, చైతన్యరెడ్డి నిర్మాతలు. ఐశ్వర్యలక్ష్మి కథానాయిక. ప్రస్తుతం ఈ పాన్ ఇండియా సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతున్నది. ఇందులో శ్రీకాంత్ క్రూషియల్ రోల్ పోషిస్తున్నారు. ప్రమోషన్‌లో భాగంగా ఆయన పాత్రను పరిచయం చేస్తూ ఓ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో శ్రీకాంత్ రగ్గ్డ్ లుక్‌తో కనిపిస్తున్నారు. సాయిదుర్గ తేజ్ పవర్‌ఫుల్ పాత్ర ఇందులో చేస్తున్నారని, పాన్ ఇండియా స్థాయిలో సినిమాను విడుదల చేయనున్నామని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: బి.అజనీష్ లోక్‌నాథ్.

భయపెట్టే ఎర్రచీర

మదర్ సెంటిమ